జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం 06 అక్టోబర్ 2026 పేజీలు:11








## అయిజలో చేనేత క్లస్టర్ పథకాలపై అవగాహన

- చేనేత కార్మికులకు అవగాహన కల్పించిన ఈ. డి .సి మేనేజర్ శ్యామల

2




# తనగల రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం

## - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

## - మల్లమ్మ కుంట రిజర్వాయర్‌కు రైతుల సహకారం అభినందనీయం

**గద్వాల అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):** మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి వడ్డేపల్లి మండలం తనగల గ్రామ రైతులు అందిస్తున్న సహకారం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు భూములు ఇస్తున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని తెలిపారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి తనగల గ్రామ రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు.

## అక్రిడిటేషన్ కార్డుల జాప్యంపై జర్నలిస్టుల ధర్నా

- డీ.పీ.ఆర్.వో నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టుకు తక్షణమే కార్డులు ఇవ్వాలని డిమాండ్



2 లో



## మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టు గొమ్మలుగా ఉన్న పాడి రైతులకు అండగా నిలుస్తూ, మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మిగతా 2 లో

- పశువుల శాంపిల్స్ సేకరణ, రవాణాకు ప్రత్యేక వాహనం ప్రారంభం
- వేగవంతమైన ల్యాబ్ పరీక్షలతో సకాలంలో వ్యాధి నిర్ధారణే లక్ష్యం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

# అక్రిడిటేషన్ కార్డుల జాప్యంపై జర్నలిస్టుల ధర్నా

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**

అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో జరుగుతున్న ఆలస్యం, డిపిఆర్ఓ శ్రీనివాస్ నిర్లక్ష్య వైఖరిపై కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బండి విజయ్ కుమార్ మాట్లాడుతూ, డిపిఆర్వో అక్రిడిటేషన్ కమిటీ వ్యవహారశైలిలో జరుగుతున్న జాప్యం కారణంగా జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అక్రిడిటేషన్ కార్డులు ఆలస్యం కావడంతో వాటికి అనుబంధంగా లభించే హెల్త్ కార్డులు కూడా ఆలస్యమవుతున్నాయని, దీంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో అక్రిడిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన జర్నలిస్టులకు ఒకేసారి కార్డులు అందజేసేవారని ఆయన గుర్తుచేశారు. తాను గతంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా పనిచేశానని, అప్పట్లో ఇలాంటి జాప్యాలు లేకుండా కార్డులు అందించిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యను అధికారులు సీరియస్‌గా తీసుకుని తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ సభ్యులు పసుపుల శ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు గండీటి నరసింహులు, జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్ తదితరులు ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజా సమస్యలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పాలనపై వార్తలను ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఒక ముఖ్యమైన గుర్తింపు అని అన్నారు. కారణాలు, కొర్రీల పేరుతో అర్హులైన జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియను నిలిపివేయడం లేదా కాలయాపన చేయడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టుల విషయంలో అవసరమైన పరిశీలనను త్వరగా పూర్తి చేసి కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లెపోగు శ్రీనివాస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జర్నలిస్టులు సమాజంలో ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి లింగగల్ల నరసింహ, జిల్లా నాయకులు వేణుగోపాల్, ఆనందం, పద్మనాభరావు, రమాదేవి, సీనియర్ జర్నలిస్టులు ఎం.వి. రమణ, జగదీష్, రవీందర్ గౌడ్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల వ్యాధి నిర్ధారణ, శాంపిల్స్ సేకరణ, సురక్షిత రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వాహనం టి ఎస్ 09యు సి 4288 ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు అకస్మాత్తుగా వ్యాధులు సోకినప్పుడు, వ్యాధి నిర్ధారణలో జాప్యం కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక శాంపిల్ సేకరణ, రవాణా వాహనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.క్షేత్రస్థాయిలో పశువుల నుంచి రక్తం, మూత్రం, ఇతర నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, అవి పాడవకుండా సురక్షితంగా ప్రయోగశాలకు తరలించడం ద్వారా వ్యాధులను సకాలంలో గుర్తించే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. తద్వారా పశువులకు తక్షణమే సరైన చికిత్స అందించడంతో పాటు రైతులకు కలిగే ఆర్థిక నష్టాన్ని తగ్గించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

**వేగవంతమైన పరీక్షలతో సకాలంలో చికిత్స:**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సేకరించిన పశువుల శాంపిల్స్‌ను ప్రయోగశాలలో వేగవంతంగా పరీక్షించి, పరీక్షా ఫలితాలను వెంటనే సంబంధిత పశువైద్యులకు చేరవేసేలా సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పశువులకు వ్యాధిని సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందించడంతో పాటు, అంటువ్యాధులు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. పశువులకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు రైతులు పశుసంవర్ధక శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు శాంతన్న యాదవ్, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, పశువైద్యులు, ల్యాబ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తనగల రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మొదటిపేజీ తరువాయి



రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై గత మూడు నెలలుగా రైతులతో పలుమార్లు చర్చలు జరిపినట్లు తెలిపారు.తొలుత కన్సెంట్ అవార్డు కింద ఎకరాకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని నిర్ణయించినప్పటికీ,రైతుల విజ్ఞప్తుల మేరకు ఇటీవల రూ.16.50 లక్షలకు పెంచేందుకు నిర్ణయించినట్లు చెప్పారు.ప్రస్తుతం కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు భూములు ఇస్తున్న రైతులకు చెల్లిస్తున్న పరిహారం తరహాలోనే తనగల రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు.రైతులకు పరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతోపాటు రిజర్వాయర్‌లో చేపల వేట హక్కులు కూడా కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు.రిజర్వాయర్ నిర్మాణానికి సహకరిస్తున్న రైతులందరికీ జిల్లా అధికార యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మాట్లాడుతూ,ఆర్డీఎస్ కింద ఆలంపూర్ నియోజకవర్గ రైతుల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనగల గ్రామ రైతులకు న్యాయం చేస్తూ పరిహారం పెంచారని తెలిపారు.అనంతరం తనగల గ్రామస్తులు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు రైతులను కలెక్టర్ అభినందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప,భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,సర్వే ఏడీ నూకరాజు,తనగల గ్రామ సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అయిజలో చేనేత క్లస్టర్ పథకాలపై అవగాహన

మొదటిపేజీ తరువాయి

అయిజ ఎం .ఎస్ .ఎం ఈ వారి సహకారంతో అయిజ చేనేత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ క్లస్టర్ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారుజోగులాంబ గద్వాల జిల్లా ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ సెంటర్ సెంటర్ మేనేజర్ శ్యామల, అసిస్టెంట్ మేనేజర్ అన్వేష్ ఆధ్వర్యంలో గ్రూపుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ పథకాలు మరియు వాటిని పొందే విధానంపై అవగాహన కల్పించి, చేనేత కార్మికులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ అవకాశాన్ని చేనేత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో అయిజ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న, ఉపాధ్యక్షుడు షర్ఫుద్దీన్, కార్యదర్శి పసలాది బసవరాజు, కోశాధికారి కసావెంకటేష్, డైరెక్టర్లు రాజశేఖర్, కొండ, అబ్దుల్ రియాజ్, శైలజ, సొసైటీ మేనేజర్ సత్యనారాయణతో పాటు అధిక సంఖ్యలో చేనేత కళాకారులు పాల్గొన్నారు.

# కొత్త జాబ్ కార్డు లు కొరకు దరఖాస్తు లు చేసుకోండి

## - ఎంపీడీవో. ఖాన్




**ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

రాజోలు మండల పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎల్‌నివో పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డులు మంజూరుకు ప్రభుత్వం నుండి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌నివో ప్రభావంతో గతంతో పోలిస్తే సాధారణ వర్షపాతం భారీగా పడిపోయింది. దీని వల్ల రైతులు పంట సాగుకు దూరం కావడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.దీంతో అలాంటివారికి ఉపయోగపడేందుకు కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేసుకున్నవారికి 15 రోజుల్లో జాబ్ కార్డు అందించేలా ప్రణాళికలు రచించింది. దీని వల్ల వారికి వెంటనే ఉపాధి లభించనుంది. ప్రస్తుతం మండలంలో 9729 జాబ్ కార్డులు ఉండగా మరి కొంతమందికి జాబ్ కార్డులు ఇవ్వాలని. కరువు పరిస్థితుల క్రమంలో కొత్తగా ఉపాధి పొందాలనుకునేవారికి జాబ్ కార్డులు జారీ చేయనున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆదాయం లభించనుంది. ఉపాధి అవసరం ఉన్నవారిని గుర్తించి ఈ పథకంలో నమోదు చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం ఆదేశించింది.

**(జాబ్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి..?)**

ఈ పథకంలో చేరాలంటే 18 ఏళ్లు తప్పనిసరిగా నిండి ఉండాలి. దరఖాస్తు ఫారంను పూర్తి చేసి ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫొటోను జత చేయాలి. ఆ తర్వాత దరఖాస్తును ఫారంను మీ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి పరిశీలన అనంతరం మీ దరఖాస్తును మండల కార్యాలయానికి పంపిస్తారు. ఎంపీడీవో దరఖాస్తును పరిశీలించి మీ అర్హతలను తనిఖీ చేస్తారు. అర్హతలు ఉంటే జాబ్ కార్డు జారీ చేస్తారు. అనంతరం మీకు ఈ జాబ్ కార్డును అందిస్తారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా జాబ్ కార్డు అందించాలని ప్రభుత్వం నిబంధనలు విధిస్తోంది.ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. దీని వల్ల గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపింది. అయితే కేంద్రం వీబీ జీరాంజీ పథకంలో అనేక మార్పులు చేసింది. పనిదినాలతో పాటు కనీస వేతనాన్ని కూడా పెంచింది. వారం రోజుల్లో డబ్బులు క్రెడిట్ చేసేలా కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రం ఈ స్కీమ్ అమలు చేస్తోంది.

# అలంపూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు, 2009 వరద బాధితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి.

**ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

అలంపూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, అలాగే 2009 నాటి వరద బాధితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అలంపూర్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో" సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు తమ విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు.ప్రతినిధులు మాట్లాడుతూ అలంపూరు పరిసర ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు తీవ్రంగా నష్టపోతున్నారని అదేవిదంగా 2009 వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు అందకపోవడం విచారకరమని, ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని వారుకోరారు.ఈ కార్యక్రమంలో ఏడిసి కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి , ఉపాధ్యక్షులు ఇస్మాయిల్ , గౌరవ సలహాదారులు ఆంజనేయులు, కమిటీ ప్రతినిధులు రజిని బాబు, ముస్తఫా, సురేష్, సంజీవ నాయుడు, విజయ్ రెడ్డి, వెంకట స్వామి, పాండు, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చే కుబోటా ఎం .యు సిరీస్ ట్రాక్టర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న

## - ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు






**ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో అయిజ పట్టణ కేంద్రంలో నూతన కుబోటా ఎం. యు సిరీస్ ట్రాక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు రిబ్బన్ కట్ చేసి నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడుమాట్లాడుతూ ఆధునిక వ్యవసాయానికి అనుగుణంగా రూపొందించిన కుబోటా ఎం .యు సిరీస్ ట్రాక్టర్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం, కలుపు నివారణ, రవాణా తదితర వ్యవసాయ పనులను తక్కువ సమయంలో సమర్థవంతంగా పూర్తి చేసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగేట్రాక్టర్‌తో వ్యవసాయ పనుల్లో సమయం, కూలీల ఖర్చు ఆదా కావడంతో పాటు, రైతుల పనిభారం తగ్గి ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వివిధ వ్యవసాయ పనులకు అనుగుణంగా పరికరాలను అనుసంధానం చేసుకునే సౌకర్యం ఉండటంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ గ, బిఆర్ .ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏ క్లాస్ పురం నరసింహారెడ్డి , కౌన్సిలర్లు, కోఆప్షన్ నెంబర్లు, మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచ్లు ,ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు,రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ లో సత్తా చాటిన 10వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీను

**ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 05:**



5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026లో 10వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ బి.శ్రీను విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. 2026 సెప్టెంబర్ 27 నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన ఈ క్రీడా పోటీలలో గెజిటెడ్ ఆఫీసర్లు పాల్గొనగా, బ్యాడ్మింటన్ సింగిల్స్ మెన్ 40 విభాగంలో బి.శ్రీను గారు గోల్డ్ మెడల్ సాధించారు. అదేవిధంగా 50 సింగిల్స్ మెన్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా 10వ బెటాలియన్ కమాండెంట్ బి.ఆదినారాయణ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ బి.శ్రీను ని అభినందించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి బెటాలియన్‌కు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని కమాండెంట్ పేర్కొన్నారు. ఈవిజయాలు బెటాలియన్ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని మరింత పెంపొందించడంతో పాటు, క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి రెడ్డి, వెంకటరమణ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అర్పి సింగ్, శ్రీనివాస్,రాజేశం ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కుమ్మరి వృత్తికి ప్రభుత్వ అండ కావాలి

- బంకమట్టి ఉచితంగా అందించాలి.. ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలి
- కలెక్టర్‌కు జిల్లా కుమ్మరి సంఘం వినతి

**వనపర్తి, అక్టోబరు 5 (ప్రజాజ్యోతి):**



సంప్రదాయ కుమ్మరి వృత్తిని పరిరక్షించడంతోపాటు వృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతూ జిల్లా కుమ్మరి సంఘం నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు రాములు కుమ్మర ఆధ్వర్యంలో సంఘం నాయకులు, కుల పెద్దలు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. కుమ్మరి వృత్తిదారులకు అవసరమైన బంకమట్టిని ఉచితంగా సేకరించేందుకు అనుమతులు మంజూరు చేయడంతోపాటు గ్రామాలకు తరలించేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కుండలు, ప్రమిదలు, దీపాలు, కూజాలు, మట్టి గణపతి విగ్రహాలు తదితర ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక మార్కెట్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ పథకాల కార్యక్రమాలు, జాతరలు, ఉత్సవాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రదర్శనల్లో కుమ్మరులు తయారు చేసిన మట్టి ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్లాస్టిక్, ఇతర ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం పెరగడంతో మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గి కుమ్మరి కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతోందని తెలిపారు. యువత సంప్రదాయ వృత్తిలో కొనసాగేందుకు శిక్షణ, ఆర్థిక సాయం, రుణ సదుపాయం, ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి వృత్తిని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుమ్మరి సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

# సమ్మేటివ్ అసెస్‌మెంట్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం

**మల్దకల్ అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మల్దకల్ మండల కేంద్రంలో 9వ,తరగతి సమ్మేటివ్ అసెస్‌మెంట్1జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. మండల విద్యాధికారి జి.సురేష్ ఆధ్వర్యంలో ఈ మూల్యాంకనం కొనసాగుతోంది. తొలిరోజు గణితం,భౌతిక శాస్త్రం ప్రశ్నపత్రాలకు సంబంధించిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన జవాబు పత్రాలను సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు కేటాయించి,నిబంధనల ప్రకారం మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ,మూల్యాంకనంలో పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పాటించి విద్యార్థుల అభ్యసన స్థాయిని సమగ్రంగా అంచనా వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో గుర్తించిన అభ్యసన లోపాలను అధిగమించేందుకు తదుపరి రిమీడియల్ బోధన చేపట్టాలని తెలిపారు. మూల్యాంకన కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రామ్ భూపాల్ రెడ్డి మృతికి సంతాపం తెలిపిన ఆలంపూర్ నియోజకవర్గశీ - ఎమ్మెల్యే విజయుడు

**ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం పెద్ద ఆముదలపాడు గ్రామానికి చెందిన బీఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ భూపాల్ రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇట్టి విషయం తెలుసుకున్న అలంపూర్ నియోజకవర్గశీ ఎమ్మెల్యే విజయుడు పెద్ద ఆముదలపాడు గ్రామానికి చేరుకుని రామ్ భూపాల్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బాడీ బిల్డర్ పోటీలలో అయిజ ప్రభాకర్ టైటిల్ విన్నర్

**ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



అయిజ పట్టణానికి చెందిన ఆర్ .ఎస్ .జిమ్ నిర్వాహకులు సర్టిఫైడ్ ట్రైనర్ ప్రభాకర్ కు ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు ఆదివారం బెంగుళూరులో వాలార్ క్లాసిక్ 2026టు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగం ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు బెంగళూరులోని బి.ఆర్.ఎస్ ఆడిటోరియం నందు జరిగిన ఈ పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొన్నారు . ఇందులో ప్రభాకర్ టైటిల్ విన్నర్ సాధించారు పథకాలను వాలర్ క్లాసిక్ ఫౌండర్ ఒలంపియా వరల్డ్ మెన్సు ఫిజిక్స్ టైటిల్ విన్నర్ హర్భజన్ , ప్రొఫెషనల్ ట్రైనర్ యాదవ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది మొదటిసారిగా అయిజ కు రావడం గర్వకారణం గా ఉంది అంటున్న అయిజ వాసులు.



# నిష్పక్షపాత విచారణతో బాధితులకు న్యాయం చేయాలి

## - ఎస్పీ టి.శ్రీనివాసరావు

### 18 మంది ఫిర్యాదుదారుల సమస్యలను విన్న ఎస్పీ



**గద్వాల అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు భరోసా కల్పిస్తోంది.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఫిర్యాదులను శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి,ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల నమ్మకమే పోలీస్ శాఖకు బలమని,సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం,జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు.ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించి 5, వ్యక్తిగత గొడవలకు 2,భర్త వేధింపులకు 2,కుటుంబ తగాదాలకు 3,చీటింగ్‌కు 3,ఇతర సమస్యలకు సంబంధించి 3 ఫిర్యాదులు అందాయి.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి,వాటి పురోగతిని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు.ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

## - కృషి సఖిలకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

## - జిల్లాను ప్రకృతి వ్యవసాయంలో ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలి:

## జిల్లా వ్యవసాయ అధికారి కె. గోవింద్ నాయక్




**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించేలా కృషి సఖిలు పనిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కె. గోవింద్ నాయక్ సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా రైతు శిక్షణ కేంద్రం బండమీదిపల్లి మీటింగ్ హాల్‌లో కృషి సఖిలకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి కె. గోవింద్ నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అక్టోబర్ 5 నుంచి 9వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ లో భాగంగా జిల్లాలోని 10 క్లస్టర్ల పరిధిలో 1,250 మంది రైతులను, 20 మంది కృషి సఖిలను అనుసంధానం చేసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో క్లస్టర్‌లో సుమారు 125 మంది రైతులను గుర్తించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

### నేల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఐదు రోజుల శిక్షణలో మట్టి నాణ్యత పరీక్షల ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయంసేంద్రియ వ్యవసాయం మధ్య తేడాలు, ప్రకృతి వ్యవసాయంలో సహజ ఇన్‌పుట్ల వినియోగం తదితర అంశాలపై కృషి సఖిలకు అవగాహన కల్పించనున్నట్లు గోవింద్ నాయక్ తెలిపారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు ఆరోగ్యకరమైన నేలను పరిరక్షించవచ్చని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కృషి సఖిలు గ్రామస్థాయిలో రైతులతో సమన్వయం చేసుకుంటూ ఎనెమ్ ఎనెఫ్ 202627 పథకం లక్ష్యాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. జిల్లాను ప్రకృతి వ్యవసాయంలో ముందంజలో నిలిపేందుకు కృషి సఖిలు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు.

### 16 ముఖ్య పోషక మూలకాలపై అవగాహన

డిప్యూటీ డైరెక్టర్ బి. వెంకటేష్ భూమిలోని 16 ముఖ్యమైన పోషక మూలకాలు, వాటి ప్రాధాన్యతను కృషి సఖిలకు వివరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి. మాధవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంచి నేల నాణ్యత, సారవంతతను మెరుగుపరచవచ్చని తెలిపారు. గోమయం, జీవామృతం, ఘనజీవామృతం వంటి సహజ ఇన్‌పుట్ల వినియోగంతో నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధానాలను వివరించారు.

### యాప్‌లో పంటల నమోదు, ఫీల్డ్ డెమోలపై శిక్షణ:

కృషి సఖిల విధులు, బాధ్యతలు, కృషి మ్యాప్ యాప్‌లో పంటల నమోదు, ఫీల్డ్ డెమో కార్యక్రమాల



నిర్వహణపైఏవో కె. సీత అవగాహన కల్పించారు. ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ రాజ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల శిక్షణను కృషి సఖిలు సద్వినియోగం చేసుకుని, శిక్షణలో నేర్చుకున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలని సూచించారు. ద్రవజీవామృతం, బీజామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి కషాయం వంటి సహజ ద్రావణాలు, కషాయాల తయారీ, వినియోగ విధానాలను ఆయన వివరించారు. ఎకో క్లబ్‌కు చెందిన చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించేలా కృషి సఖిలు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ (అర్బన్) మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస, ఏవో ఎం. చంద్రిక, ఎఫ్టిసి సిబ్బంది, కృషి సఖిలు తదితరులు పాల్గొన్నారు..

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

## - అధికారులకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశం

## - ప్రజావాణికి 100 వినతులు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**



ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజల ఫిర్యాదులను అధికారులు సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విని, ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా చదివి, సమస్యను పూర్తిగా అర్థం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, నిబంధనల ప్రకారం సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ సర్వేరికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి, విద్యుత్, విద్య, వైద్యఆరోగ్యం, మైనింగ్, అటవీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 100 వినతులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బుల్లెట్ బైక్‌లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

## - మాడిఫైడ్ సైలెన్సర్లతో అధిక శబ్దం చేస్తే కఠిన చర్యలు

## - సుమారు 30 వాహనాలు సీజ్: ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**




పట్టణంలో శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బుల్లెట్ బైక్‌లపై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు సోమవారం ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అధిక శబ్దం చేసే మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకుని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు గుర్తించిన సుమారు 30 బుల్లెట్ బైక్‌లను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కొంతమంది వాహనదారులు బుల్లెట్ వాహనాలకు కంపెనీ/షోరూమ్ ద్వారా అమర్చిన అసలు సైలెన్సర్లను తొలగించి, అధిక శబ్దం వచ్చేలా మాడిఫై చేసిన సైలెన్సర్లను అమర్చుకుని పట్టణంలో తిరుగుతున్నారని తెలిపారు. ఇలాంటి అధిక శబ్దంతో కూడిన వాహనాల వల్ల ప్రజలకు అసౌకర్యం కలగడంతో పాటు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

### మాడిఫైడ్ సైలెన్సర్ల తొలగింపు:

ప్రత్యేక డ్రైవ్‌లో గుర్తించిన వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, మెకానిక్‌ల సహాయంతో మాడిఫై చేసిన సైలెన్సర్లను తొలగించినట్లు తెలిపారు. వాహనాలకు అసలు/నిర్దేశిత సైలెన్సర్లను తిరిగి అమర్చేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే వాహనదారులకు శబ్ద కాలుష్యం వల్ల కలిగే ఇబ్బందులు, నష్టాలు మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

### తనిఖీలు మరింత ముమ్మరం:

ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేసే మాడిఫైడ్ సైలెన్సర్లు, అనధికారిక వాహన మార్పులు, ఇతర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఇకముందు కూడా ప్రత్యేక తనిఖీలు, డ్రైవ్‌లు కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు సురక్షితమైన, క్రమబద్ధమైన ట్రాఫిక్ నిర్వహణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు అనధికారికంగా మార్పులు చేయకుండా పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

# నేడు దిశ సమావేశం

## - కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

## - గత సమావేశం ఆదేశాలపై ఏటీఆర్ సమర్పించాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ అధ్యక్షతన మంగళవారం (అక్టోబర్ 6) దిశ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని తెలిపారు. సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతో పాటు గత దిశ సమావేశంలో ఇచ్చిన సూచనలు, ఆదేశాల అమలు తీరుపై కూడా సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గత దిశ సమావేశంలో శాఖల వారీగా ఇచ్చిన ఆదేశాలు, పెండింగ్ అంశాలు, వాటిపై తీసుకున్న చర్యలు, పనుల ప్రస్తుత స్థితి, పురోగతి, కొత్తగా మంజూరైన పనులు, లబ్ధిదారుల వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

### ప్రతి శాఖ నుంచి ఏటీఆర్ తప్పనిసరి



గత సమావేశం మినిట్స్ ఆధారంగా ప్రతి శాఖకు సంబంధించిన అంశాలపై యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలాంటి నివేదికలు పెండింగ్‌లో ఉండకూడదని, గత సమావేశంలో ఇచ్చిన సూచనలు, ఆదేశాల అమలుపై స్పష్టమైన వివరాలను అధికారులు సమావేశంలో అందించాలని ఆదేశించారు. దిశ సమావేశానికి సంబంధించిన నోట్స్, ప్రెజెంటేషన్ల తయారీకి అవసరమైన పూర్తి సమాచారాన్ని అధికారులు ముందుగానే అందించాలని కలెక్టర్ సూచించారు. శాఖల వారీగా చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతి, పెండింగ్ అంశాలపై స్పష్టమైన వివరాలతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం

## - ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ దరావత్ జానకి

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా ఎస్పీ దరావత్ జానకి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు అందజేసిన ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి, సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి పోలీస్ సంబంధిత సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ జానకి తెలిపారు.

# నారాయణమ్మ సేవలు చిరస్మరణీయం.

## - నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల కేంద్రమైన వీపనగండ్ల లో సోమవారం నారాయణమ్మ సంస్మరణ సభను సిపిఎం మండల కార్యదర్శి బాల్రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఏపీ రాష్ట్ర మాజీ







కార్యదర్శి మధు హాజరయ్యారు వారు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణమ్మ తన కుటుంబాన్ని ఉద్యమ కుటుంబం గా మార్చారని సిపిఎం కు రాష్ట్ర నాయకులు అందించారని అన్నారు దోపిడి వ్యవస్థ పోవాలన్న అసమానతలు లేని సమాజం రావాలన్నా సోషలిజం వల్లే సాధ్యమవుతుందని కమ్యూనిస్టు పార్టీ వచ్చినప్పుడే బడుగు బలహీన వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని వారు తెలిపారు నారాయణమ్మ కష్టకాలంలో అంబలి కేంద్రాలు నడిపించారని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు నాయకులు జబ్బార్ రామ్ రెడ్డి కిల్లె గోపాల్ జెవివి నాయకులు రాజేశ్వరరావు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వ సాధనకు ఐక్యంగా పోరాడాలి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్ .**

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా వీపనగండ్ల మండల కేంద్రంలో కేవీపీస్ జెండాను సీనియర్ నాయకులు ఏటూరి నరసింహ ఎగురవేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో కులవివక్ష రూపాలు అనేక రూపాలలో కనిపిస్తున్న ప్రభుత్వాలు వాటిని నివారించడంలో విఫలం అయ్యాయని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కేవీపీస్ అనేక వివక్ష రూపాలను పారద్రోలడానికి పోరాటాలు కొనసాగించి విజయం సాధించాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యమై అంటరానితనం నిర్మూలన, కులవివక్ష రూపుమాపేలా భవిష్యత్ పోరాటాలు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు వెంకట్రాములు, వీపనగండ్ల మండల కార్యదర్శి మురళీ,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్ రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# 100 మంది రైతుల పర్యటనను జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

## - మహారాష్ట్రలో ఉద్యాన పంటల పరిశీలనకు జిల్లా రైతులు

**గద్వాల అక్టోబర్ 05(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 100 మంది రైతులను మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఉద్యాన పంటల పరిశీలనకు పంపిస్తున్నారు.ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కొనసాగనున్న





రైతుల పర్యటనను సోమవారం ఐడీఓసీ ఆవరణలో జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ పర్యటనలో భాగంగా రైతులు మహారాష్ట్రలోని బారామతిలో ఉన్న నేషనల్ రీసెర్చ్ సెంటర్‌తో పాటు మహాబలేశ్వర్ తదితర ప్రాంతాలను సందర్శించి, అక్కడ సాగు చేస్తున్న వివిధ ఉద్యాన పంటలు,తోటలను పరిశీలించనున్నారు.ఉద్యాన పంటల సాగులో ఆధునిక పద్ధతులు,సాంకేతికతను తెలుసుకునేందుకు ఇలాంటి పర్యటనలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు.రైతులు ఈ పర్యటనను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ,పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్‌కుమార్,రాజశేఖర్,మహేష్,ఇమ్రాన్,శివ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు వారసత్వ హక్కుతో ఎకరా భూమి మోటివేషన్ చేశారని ఆరోపణ.

**ప్రజావాణిలో, పోలీసులకు జ్యోతి ఫిర్యాదు**

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 804ఈ లోని ఎకరా భూమికి సంబంధించి తప్పుడు వారసత్వ హక్కు చూపించి తనకు తెలియకుండా మోటివేషన్ చేయించుకున్నారని ఆరోపిస్తూ జ్యోతి అధికారులు,పోలీసులను ఆశ్రయించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు.సర్వే నంబర్ 804 ఈ లోని ఎకరా భూమిపై తనకు చట్టబద్ధమైన హక్కులు ఉన్నప్పటికీ, తన మరిది రామన్‌గౌడ్ తప్పుడు వారసత్వ హక్కు చూపించి తన పేరుపై మోటివేషన్ చేయించుకున్నారని జ్యోతి ఆరోపించారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ ప్రక్రియ చేపట్టడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత రెవెన్యూ రికార్డులు సమర్పించిన పత్రాలను పరిశీలించాలని ఆమె కోరారు. మోటివేషన్ ప్రక్రియలో సంబంధిత వ్యక్తులు, అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, సర్వే నంబర్ 804 ఈ లోని ఎకరా భూమిపై తనకున్న చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించాలని జ్యోతి అధికారులను కోరారు.




# చిన్నంబావి ప్రజావాణికి, కేవలం మూడు దరఖాస్తులు మాత్రమే

**చిన్నంబావి,అక్టోబరు 5 (ప్రజా జ్యోతి)**




చిన్నంబావి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సుర్ణ ఆదర్శ్‌గౌడ్, తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగింది. వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం మూడు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇందులో ఒకటి ఇందిరమ్మ ఇళ్లకు, రెండు ఇరిగేషన్ శాఖకు సంబంధించినవని వివరించారు. దరఖాస్తులను సంబంధిత జిల్లా కార్యాలయాలకు పంపించి,త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. శ్రీనివాస్, ఎంపీఓ రామస్వామి, వివిధ శాఖల అధికారులు, ఈ-పంచాయతీ ఆపరేటర్ తదితరులు ఉన్నారు.

## పట్టపగలే చోరీ.. బంగారం, నగదు అపహరణ

### - ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడిన దొంగ.. బైక్ వదిలి పరార్

**ఆలంపూర్ అక్టోబర్ 5(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**





జోగులాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలం,పెద్ద చింతరేవుల గ్రామంలో పట్టపగలే చోరీ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తంబాళి నాగరాజు ఇంట్లోకి గుర్తుతెలియని దొంగ చొరబడి బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు సమాచారం. స్థానికుల సమాచారం మేరకు.. ఇంట్లోకి ప్రవేశించిన దొంగ సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 90 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. చోరీ జరుగుతున్న సమయంలో స్థానికులు అక్కడికి రావడాన్ని గమనించిన దొంగ భయంతో అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. పారిపోయే క్రమంలో దొంగ తన వెంట తెచ్చుకున్న బైక్‌ను ఇంటి ముందే వదిలేసి వెళ్లినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇంటి పరిసరాలను పరిశీలించిన పోలీసులు చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. దొంగ వదిలి వెళ్లిన బైక్ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. చోరీకి సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## జర్నలిస్టులకు హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి

### - జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### - అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు ఇవ్వాలి

### - టియుడబ్ల్యూజే-హెచ్143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్

**నాగర్ కర్నూల్ :: అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి)**

జర్నలిస్టులకు హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని,అదేవిదంగా ఇండ్లు,ఇళ్ల స్థలాలు కేటాయించాలని,అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు నాయక్ లు డిమాండ్ చేశారు.టీయూడబ్ల్యూజె -హెచ్143 రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గల మహాత్మా గాంధీ విగ్రహం ముందు సోమవారం ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు,జర్నలిస్టులకు ఇండ్లు,ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అదేవిదంగా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు ఇవ్వాలని రాత పూర్వకంగా జర్నలిస్టులు పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా అబ్దుల్లా ఖాన్,చందునాయక్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను అందించాలని,గతంలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఎంతగానో ఉపయోగపడ్డాయని ప్రస్తుతం జర్నలిస్టుల హెల్త్ కార్డులకు కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులలో చిన్నాచితికా వైద్యంకూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సమాజంలో నాల్గవ స్తంభంగా చెప్పుకునే మీడియా రంగంలో పనిచేసే జర్నలిస్టులకు కనీసం హెల్త్ కార్డు సౌకర్యం కూడా లేకపోవడం బాధాకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హెల్త్ కార్డులను ప్రభుత్వ ఉద్యోగులకు సమా నంగా జారీచేయాలని,అదేవిధంగా జర్నలిస్టులకు ఇండ్లు,ఇళ్ల స్థలాలను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మీడియా వృత్తినే సర్వస్వంగా భావించి ఈ వృత్తిలో కొనసాగుతున్న వారికి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వృత్తినే నమ్ముకొని పనిచేస్తున్న వారికి కనీసం గూడు కూడా లేకపోవడం బాధాకరమైన అంశం కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన నాలుగు ఎకరాలలో స్థలాలు కేటాయిస్తూ శాశ్వతపట్టాలు అందించాని



ఇందుకోసం ఎమ్మెల్యే కూచకుల్ల రాజేష్ రెడ్డి,ఎమ్మెల్సీకూచకుళ్ల దామోదర్ రెడ్డి లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారుని అదేవిధంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులను వెంటనే జారీ చేసి జర్నలిస్టులకు మేలు చేయాలన్నారు.టీయూడబ్ల్యూజే హెచ్ 143 పోరాట ఫలితంగా మూడవ విడత అక్రిడేషన్ కార్డులను నాగర్ కర్నూల్ జిల్లాలో జారీ చేయడం జరిగిందని అనేక ఉద్యమాల ఫలితంగా మూడవ విడతలు కార్డులు వచ్చాయని దీనిని కార్డులు వచ్చినరోజే ప్రత్యర్థి యూనియన్ వారు తమ వల్లే అక్రిడేషన్ వచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారంచేసుకోవడం వారి అవివేకానికి నిదర్శనమని,అధికార పక్షమైన యూనియన్ సభ్యులు అయి ఉండి కనీసం జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మొదటి,రెండవ వి డతల్లో పూర్తి చేయాల్సి ఉండగా లోపాభూఇష్టమైన కమిటీ వ్యవహారంవల్ల జర్నలిస్టులకు తీరనిఆలస్యం జరిగిందని ఆరోపించారు.జిల్లాలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల ఆలస్యానికి కారణం ఎవరో అందరికీ తెలుసు అన్నారు. సీనియర్ జర్నలిస్టులు శేఖరాచారి, ఏటిగడ్డ వెంకటేష్,పులిజాల బాలస్వామి, రమేష్, అహ్మదుల్లా ఖాన్, యూనియన్ రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాస్ గౌడ్,జర్నలిస్టులు మహమ్మద్ సాదిక్,శేఖర్,రామకృష్ణ,జంగిటి రాజేష్,గంధం ప్రసాద్ ,సయ్యద్ రబ్బాని,వెంకటస్వామి,ఇర్ఫాన్ ఖాన్,వి జయేందర్ రెడ్డి,అచ్చంపేట జర్నలిస్టులు ప్రకాష్,గోపి,బాలిశ్వర్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర కుటుంబాలకు ఆర్థికంగా ప్రభుత్వం చేయూతనివ్వాలి

### - మట్టి పాత్రలకు ప్రభుత్వ విభాగాల్లో ప్రాధాన్యత కల్పించాలి.

### - పెబ్బేరు మండల కుమ్మర సంఘం అధ్యక్షులు సూర్యవంశం హర్షవర్ధన్.

### - యూత్ అధ్యక్షులు సూర్యవంశం సురేష్.

**పెబ్బేరు అక్టోబర్05 ప్రజాజ్యోతి**

తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (౧=ఖూ) అధ్యక్షులు నడికుడి జయంత్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద పిలుపుమేరకు వనపర్తి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు సుగురు రాములు, ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరుశరాముడు పిలుపుమేరకు పెబ్బేరు మండలంలో వివిధ గ్రామాలలో కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ, పెబ్బేరు మండల కుమ్మర సంఘం అధ్యక్షుడు సూర్యవంశం హర్షవర్దన్, యూత్ అధ్యక్షుడు సూర్యవంశం సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం ఎంపీడీవో వెంకటేశ్వర్లు కు అందజేశారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కుమ్మరి వృత్తిదారులకు ప్రధానంగా అవసరమైన బంకమట్టిని సేకరించడం, రవాణా చేసుకోవడం ప్రస్తుతం భారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం బంకమట్టిని ఉచితంగా అందించడంతో పాటు, గ్రామాలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని అన్నారు. యూత్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ వృత్తిదారులు తయారు చేస్తున్న మట్టి కుండలను, ప్రమిదలు, దీపాలు, కూజాలు,మట్టి గణపతి విగ్రహాలు తదితర సంప్రదాయ వస్తువులకు ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు, ఇచ్చి ప్రభుత్వం కుమ్మరలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ ప్రధాన కార్యదర్శి ఎన్కిచర్ల శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శి ధర్మ తేజ, కుమ్మరి కుల బంధువులు కుమ్మరి శ్రీరాములు, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నంబావిలో డ్రగ్స్ కట్టడికి గట్టి నిఘా!

**చిన్నంబావి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి)**

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు చిన్నంబావి మండల కేంద్రంలో పోలీసులు సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా స్పెషల్ డ్రగ్స్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది మండలంలోని పలు హోటళ్లు, కిరాణా దుకాణాలు, మెడికల్ షాపులు తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద ప్రాంతాలు,దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డ్రగ్స్ అమ్మినా.. రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా,అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్ స్పెషల్





బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్ సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ తనిఖీల్లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్, శేఖర్, కానిస్టేబుల్ కర్ణాకర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

**పెబ్బేరు, అక్టోబర్05 ప్రజాజ్యోతి**

పెబ్బేరు మండల శివారులోని మోడల్ స్కూల్ సమీపంలో జాతీయ రహదారి44 పై ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహన డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా ఎలాంటి సూచికలు ఇవ్వకుండా ఒక్కసారిగాకుడివైపునకు వాహనాన్ని మళ్లించాడు. ఈ క్రమంలో అదే




మార్గంలో వెళ్తున్న డబ్ల్యూబీ08ఎస్4200 నంబరు గల ఎరుపు రంగు కారును డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సురభి (36) తీవ్రంగా గాయపడ్డారు.తీవ్ర గాయాలపాలైన సురభిని చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓమిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఆమె భర్త పుష్పేంద్ర కుమార్ స్వల్పంగా గాయపడగా, వారి కుమార్తె కియారాకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహన డ్రైవర్‌ను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఘటన పై దర్యాప్తు చేపట్టి, బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళల సర్వతోముఖాభివృద్ధి

## - మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు అక్టోబర్05 ప్రజాజ్యోతి**

పొదుపు సంఘాల మహిళలు కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం కాకుండా, అక్షరాస్యత లోను రాణించి ఆధునిక బ్యాంకింగ్ సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పెబ్బేరు మున్సిపల్ కార్యాలయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పొదుపు మహిళల కోసం ప్రత్యేకంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో చైర్మన్ మాట్లాడుతూ..






మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి బ్యాంకింగ్ లావాదేవీలు, పొదుపు పథకాలు, డిజిటల్ చెల్లింపులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ, ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ వైస్ పెబ్బేరు టౌన్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి,మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ గణేష్ బాబు, శశికళ రెడ్డి, సురేష్ రెడ్డి ఎస్బీఐ మేనేజర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్, కే. కురుమయ్య, సిబ్బంది వెంకటేష్, అరుణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ దృష్టి.. బూత్ కమిటీ సభ్యుల సమావేశం



గండీడ్: రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గండీడ్ మండల కేంద్రంలో బీజేపీ మండల బాడీ, బూత్ కమిటీ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యకలాపాలను గ్రామస్థాయిలో మరింత విస్తృతం చేయడంపై సమావేశంలో చర్చించారు.ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నూతన ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించడం, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయించేలా చర్యలు చేపట్టాలని నాయకులు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలను విభజించి ఒక్కో ప్రాంతానికి ఒక్కో వ్యక్తిని ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. మొత్తం 30 మంది సభ్యులతో మండల కమిటీని ఏర్పాటు చేయగా, ఐదుగురు కన్వీనర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు కె. విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా గిరమోని శ్రీనివాస్, పరిగి అసెంబ్లీ కో-కన్వీనర్ ప్రభు నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్ హాజరయ్యారు. అలాగే మాజీ ఎంపీటీసీ వెంకటేష్, మండల కమిటీ సభ్యులు, వివిధ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని నాయకులు సూచించారు.

# కుమ్మరి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

## - బంకమట్టి ఉచితంగా అందించాలి..

## - మట్టి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి





**చిన్నంబావి, అక్టోబరు 5 (ప్రజా జ్యోతి)**

తరతరాలుగా కొనసాగుతున్న కుమ్మరి కులవృత్తిని పరిరక్షించడంతో పాటు వృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో తహసీల్దార్ కె. శ్రీనివాస్ కు మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కుమ్మరి వృత్తికి ప్రధాన ఆధారమైన బంకమట్టిని ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం ముడిసరుకు కొరత, తయారు చేసిన ఉత్పత్తులకు సరైన మార్కెట్ లేకపోవడంతో వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మట్టి పాత్రలు, ఇతర ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంస్థల ద్వారా మార్కెట్ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆధునిక పరికరాలు, సాంకేతిక శిక్షణ అందించి వృత్తి నైపుణ్యాన్ని పెంచాలని కోరారు. కుమ్మరి కుటుంబాలకు ఆర్థిక సాయం, బ్యాంకు రుణ సదుపాయాలు కల్పించడంతో పాటు వృత్తి అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కులవృత్తుల పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం కుమ్మరి వృత్తిదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాతృసంఘం అధ్యక్షుడు వెంకటస్వామి, యువజన అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యక్షుడు సుగురు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు సుగురు బుచ్చయ్య, గౌరవ సలహాదారులు బుచ్చన్న, మదనాగుల నారాయణ, సంఘం నాయకులు సుగురు భాస్కర్, రమేష్, ఆంజనేయులు, వెంకటస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు గడ్డపై బహుజన సమరభేరి...

## -20వ రోజుపాదయాత్రలో భాగంగా...ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న 'కార్నర్ మీటింగ్' కు జనసముద్రం తరలిరావాలి.

## -దొరల పాలనకు కాలం చెల్లింది.. బహుజన రాజ్యాధికారమే ధ్యేయం!

## -ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు, బహుజన సైన్యం పెద్ద ఎత్తున తరలిరావాలి!

**పెబ్బేరు అక్టోబర్05 ప్రజాజ్యోతి**



తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా సాగుతున్న సామాజిక అణచివేతకు, రాజకీయ వంచనకు చరమగీతం పాడుతూ, 93% శాతమున్న బహుజనులను పాలకులుగా మార్చే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (౧రా) వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన మహా పాదయాత్ర వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోకి ప్రవేశిస్తోంది. 20వ రోజు పాదయాత్రలో భాగంగా పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహించబోయే భారీ 'కార్నర్ మీటింగ్' ను దిగ్విజయం చేయడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు మరియు అన్ని బహుజన కుల సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలని వనపర్తి జిల్లా టిఆర్పి నాయకులు విజయ్ యాదవ్ మరియు యూత్ అధ్యక్షులు గుజ్జుల రవికుమార్ పిలుపునిచ్చారు.""ఓట్లు వేసే మిషన్లుగా మారిన బహుజనులు.. ఇప్పుడు శాసించే పీఠాలు ఎక్కబోతున్నారు! ఇన్నాళ్లు వేరేవారి జెండాలు మోసింది చాలు, మన ఆత్మగౌరవం కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార జెండాను ఎత్తారు. పెబ్బేరు మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి తండా, గూడెం నుండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సోదర సోదరీమణులు ఉక్కు పిడికిలై పెబ్బేరు కార్నర్ మీటింగ్‌కు పోటెత్తాలి. మన జనాభా బలం ఏంటో, బహుజనుల ఐక్యత ఏంటో పాలకవర్గాలకు చూపిద్దాం!" అని హెచ్చరించారు.

# పెబ్బేరు మున్సిపాలిటీలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.

## - లబ్ధిదారులకు అందజేసిన

## - చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్.

**పెబ్బేరు అక్టోబర్05 ప్రజాజ్యోతి**

పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన జి.గణేష్ రూ. 18,000/- డి.ఊర్మిళ రూ. 17,000/- రాజా వసుంధర రూ. 16,000/- రాజా శరణ్య రూ. 60,000/- టి. అశ్విని రూ. 21,000/- లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఆసరాగా నిలుస్తుందని చైర్మన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.



# పెబ్బేరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**పెబ్బేరు అక్టోబర్05 ప్రజాజ్యోతి**

పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో పట్టణాభివృద్ధి పనుల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ నిధులు రూ. 1 కోటి 75 లక్షల 50 వేలతో పలు పనులను ప్రారంభించగా, తాజాగా మిగిలిన పనులకు సోమవారం ఘనంగా శంకుస్థాపనలు నిర్వహించారు. సుమారు రూ. 66 లక్షల అంచనా వ్యయంతో వివిధ కుల సంఘాల భవనాలు, పలు ఆలయాల కామన్ హాల్స్, ప్రభుత్వ ఉపాధ్యాయుల భవన నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు, ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జమ్ములమ్మ, శివసాయి, తాటికొండ కృష్ణ, భాగ్యలక్ష్మి శివ, మంగరాయి మన్యం, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి, షకీల్ వివిధ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# సాగునీటి కోసం రైతుల విజ్ఞప్తి

## - ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి..

## - 300 ఎకరాల పంటను కాపాడాలి

సాగునీటి కోసం అధికారులను కోరిన సర్కార్‌పేట్, రంగారెడ్డిపల్లి, లింగాయపల్లి, బైస్పల్లి రైతులుగండీడ్: సర్కార్‌పేట్, రంగారెడ్డిపల్లి, లింగాయపల్లి, బైస్పల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ పంటలను కాపాడేందుకు సాగునీరు అందించాలని అధికారులను కోరారు. పెద్దవాగు ఆధారంగా ఆయా గ్రామాల రైతులు వరి పంట సాగు చేసినప్పటికీ, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురవడంతో వాగులో నీటి లభ్యత తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఎగువన ఉన్న సాలార్‌నగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా సుమారు 300 ఎకరాల పంటలను కాపాడే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. రైతుల పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.అదేవిధంగా సాలార్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో అక్రమంగా బోర్లు ఏర్పాటు చేసి ప్రాజెక్టు నీటిని బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.తమకు సాగునీరు అందించడం వల్ల ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగదని, తమ పంటలు మాత్రమే కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి సాలార్‌నగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు.



## జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ అండర్ 14 మరియు 17 కోకో ఆట లో మేరీ మెమోరియల్ పాఠశాల

కృష్ణా అక్టోబర్ 05 (ప్రజా జ్యోతి)

కృష్ణ మండలం లోని గుడెబల్లూర్ గ్రామంలో మేరీ మెమోరియల్ పాఠశాల విద్యార్థులు నారాయణ పేట జిల్లాలో క్రీడా మైదానం లో అండర్ 14,అండర్ 17 కోకో ఆటలో బాగంగా విద్యార్థులు సింధు,అనురాధ, వేదశ్రీ, రేణుక,నందిని, మొదటి బహుమతులు గెలుచుకొని విజేతలుగా నిలిచారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల మేనేజ్మెంట్ జకరయ్య, వైస్ ప్రిన్సిపాల్ జిందప్ప, ఉపాధ్యాయ బృందం. కలిసి విద్యార్థులను శాలువాలతో సన్మానించారు.




## గుండెపోటుతో వ్యక్తి మృతి

### - వ్యవసాయ పనుల్లో అస్వస్థత..

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

చిన్నంబావి,అక్టోబర్ 5

(ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన మేకల రోషన్న (56) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లిన ఆయనకు మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా చేతిలో నొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారు.కుటుంబ సభ్యులు వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.రోషన్న మృతితో కుటుంబ సభ్యులు,బంధువులు విషాదంలో మునిగి పోయారు.

